
# లజ్జిందేవి

జైరాజ్




కాకి నోటి నుండి జారి పడిన కోడిపిల్లది.

మల్లమ్మ అంట్లు తోముకుం టుంటే అంట్లగిన్నెల ఇరుకునబడి 'కీస్' 'కీస్' మని ఒకటే గోల.

అదలా పడిందో లేదో. మళ్ళీ దాన్ని నోట గరుచుకు పోవాలని కాకి వెంటనే గిన్నెల మీద వాలింది.

ఇదంతా క్షణంలో జరిగిపోగా, మల్లమ్మ తలెత్తి సంగతి గ్రహిం చేసి "ఉష్షో- ఉష్షో! ఎదవకానా— ఎదవముండా" అని కాకిని తోలేసి, గిన్నెలు జరిపి ఆ సందులో పడున్న కోడిపిల్లను చేతుల్లోకి తీసుకొని "అమ్మ నా తల్లోయ్! బుజ్జిముండా, ఎంత పని జరిగిందే..." అంటూ లేచి ఇవతలి కొచ్చి "అమ్మగారూ! కూతంత ఉప్పుకారమూ ఇలా గివ్వండి" అని కేకేసింది. ఆ యమ్మ గారు బైటికొచ్చి "ఏవిటే, ఎం దుకూ?" అంటూ మల్లమ్మ చేతిలో

రక్తంతో తడిసున్న కోడిపిల్లను చూసి 'ఎందుకోలే' అనుకొని ఇంత ఉప్పుకారం తెచ్చిచ్చింది. మెడమీద తోలు రేగిపోయి రక్తం కారుతున్న చోట ఉప్పుకూరి కారం కలిపి అద్ది, చీరకొంగు చించి కట్టు గట్టింది.

"అదేవిటది- వైద్యవేవిటే?" అనడిగిందాయమ్మగారు జానికమ్మ.

"నా బొంద వైద్దిగంలే తల్లీ! ఏదో దానదుష్టం- బతికితే బతుకు ద్దేమోనని. పసిముండ" అన్నది మల్లమ్మ జాలిగా.

తోటి మానవులమీద జాలి దల చని జానికమ్మకదేదో విడ్డూరంగా తోచింది.

"దాని మొఖం-అదింకేం బ్రతు కుద్దే" అంది.

"అదేం మాటలే అమ్మగారూ! యములోడి సేతిలో బడి ఊడిరావ డం దానదుష్టంగాదా? దీనికింకసావు రాదు, సూడండి- నేనన్నాను" అంటూ కాస్త కోలుకున్నట్టు నిమ్మ ళించిన కోడిపిల్లను కిందబెట్టింది. కీచుమంటూ నిలబడలేక ఒకపక్క కొరిగిపోతుంది కోడిపిల్ల.

"ఓలమ్మో! దీని కాలొకటిరిగి పోయిందమ్మో!"అన్నది మల్లమ్మ.

"అయితేసరే కట్టు, దాని క్కూడా ఓ కట్టు" అంది వెట కారంగా జానికమ్మ.

"దాని కాలే సీపురు పుల్లం తుంటే దానికేం కట్టుగట్టేదమ్మా! ఏమోలెండి- దానదుట్టముంటే అదే అతికిపోద్ది" అంటూ సున్నితంగా దాన్ని ఒడిలో బెట్టుకుని పని ముగించింది మల్లమ్మ.

"ఎల్లొత్తానమ్మగారూ!" అంటే, "ఎలాగుందే నీ కోడిపిల్ల?" అన డిగింది జానికమ్మ.

"నిద్దరోతోందమ్మా- పిచ్చి ముండ" అని చేతిలోకి తీసుకుని ముద్దాడింది మల్లమ్మ.

కీస్___కీస్ మంది కోడిపిల్ల.

"అమ్మో- నా తల్లే! నెప్పె ట్టిందా?" అంటూ మళ్ళీ దాన్ని చీర మడతలో వేసుకుని"వెళ్ళొస్తా నమ్మగారూ" అంటూ వెళ్ళి పోయింది మల్లమ్మ. "ఎవిటో దాని పిచ్చి" అని అదోలా నవ్వుకుంది జానికమ్మ.

నిజంగానే పిచ్చిముండ మల్లమ్మ.

"గంగాజలానికి పోగా ఈయా ల్టికి మిగిలిందింతేనే" అంటూ రూపాయన్నరో రెండో గంగులు చేతబెడితే నవ్వుతూ అందుకుం టుందేగాని, "ఎందుకొచ్చిన సారా యిలే మావా?" అనదు. 'ఉన్న దిద్దరమే గదా, నీ పాటుకి నా పాటు

(మిగతా కథ 49వ పేజీలో)

తోడుందిగా అదే సాలు'- అను కుంటుంది మనసులో.

గంగులు తాగొచ్చి ఖుషీగా వుంటే ఆ నాటికది సొరగం అను కుంటుంది. వాడు చిరుబుర్లాడితే 'ఈయాల్టికి నరకం గాని రేపు మల్లా సొరగమేగా' అని సరి పెట్టుకుంటుంది.

రిక్షా చెట్టు కింద ఆపి- "వణ్ణ వెట్టవే" అంటూ వచ్చిన గంగులికి వడ్డించి, వాడు తింటుంటే కోడిపిల్ల సంగతి చెప్పింది మల్లమ్మ.

"మరిసెప్పావు గాదేటే, ఏదీ ఆ గొడుగు పుల్లగ్గుచ్చి కాల్చిటుదే పంటి కింద కేత్నేదు" అన్నాడు గంగులు.

"ఆయ్! ఏటా తాగిన మైకంలో పాడు మాటలు? ఆ పసి కూన ఉసురెట్టుకోమంటావా? సిగ్గు నేదూ!" అని కళ్ళెర్రజేసింది మల్లమ్మ.

మల్లమ్మ కళ్ళల్లో అంత కోపం ఏనాడూ చూసెరగడు గంగులు.

ఎంత తాగేసున్నా తానన్నమాట తప్పేనని తెలుసుకుని-"ఏటే, ఏదో తమాసకాల కలాగంటే అంతలావు గిదయిపోతన్నవ్" అని సరి దేశాడు.

"అదిగాదు మావా! ఒక్క పూటలో కెంత మాలిమయ్యిందో సూడు" అంటూ అరచేతిలో నూక లేసుకుని కోడిపిల్లను మేపుతూ "సూడెంత బుజ్జిగుందో" అంది.

"అదిసర్లేయే, పావుకోడయా కైనా సేరు వెడతావా?" అన్నాడు గంగులు.

"స్సీ, పాడుబుద్ధీ నువ్వూను. దీన్నసలు కొయ్యనే కొయ్యను. పెద్దచేసి పిల్లల్ని జేయిత్తా సూడు" అన్నది మల్లమ్మ.

"ఒసోస్, అదిగాని పుంజు పిల్లయితేనో?" వెటకారం జేశాడు గంగులు.

"పుంజుపిల్ల కాగూడదని అపి రమ్మకు మొక్కుకుంటాను. అప లది పెట్ట పిల్లేలే మావా! కాకి నోటి నుంచి తప్పించుకున్న దానికి నీ నోటి నుంచి తప్పించుకోవడ మెలాగో తెల్దేంటి? అది పెట్టపిల్లే అవ్వుద్ది సూడు. ఒకేళ పుంజుపిల్లి యినా కొయ్యమంటే మాత్రం నేను సచ్చినా కోసేది లేదు" అంటూ కోడిపిల్లని రెండు చేతుల్లో ఇరికించి పట్టుకుని ముద్దాడింది మల్లమ్మ.

"ఏల్లెహె, అది పుంజుపిల్లే అవ్వుద్ది సూడు" అన్నాడు గంగులు కవ్వించాలని.

"అవ్వదు సూడు. ఇదదుట్ట వంతురాలని జెప్పానా? బిడ్డొచ్చినేల గొడ్డొచ్చినేల మంచిదవ్వాలంటారు సూడు- పొద్దుగుంకే లోపల దాన దుట్టం మనకీ అంటుకొంటాది సూడు—సూ త్తుం డు" అన్నది మల్లమ్మ.

"ఆఁ, అం టు కొం టా దే... అదుగో అంటుకుంది సూసుకోయే సీర నిండా దానిరెట్ట" అంటూ గేళి చేశాడు గంగులు.

"అలాగలాగే సూ త్తుం డు" అన్నది. అదేదో అదృష్టం వెంట బెట్టుకొచ్చిందన్న నమ్మకంతోగాదు గంగులు కూడా తనలాగే దానిమీద మరులుగొనాలని.

"సూద్దాంలేయే" అని చెయ్యి గడుక్కొని లేచిపోయాడు గంగులు.

మల్లమ్మ తమాషా కన్నా, ఆమె మాటే నిజమయింది.

వారానికో పావలా చొప్పున కట్టుకుంటున్న చీటి వారానికోసారి ఎత్తుతారు. మంగమ్మ ఆ వారం మూడోపావలానే కట్టింది. ఆరోజు చీటె త్తితే మల్లమ్మకే పేలింది. పది రూపాయలొచ్చింది.

"మాయమ్మ లచ్చిందేవే...." అని కోడిపిల్లని మురుసుకుంది మల్లమ్మ.

ఆ సాయంత్రం "మావో! నా మాట కాదన్నావే?" అంటూ సంగతి జెప్పింది మల్లమ్మ. ఒక ప్పుడు చెప్పగూడదనుకుంది గాని, కోడిపిల్ల ఘనతను చాటాలని చెప్పింది. అది నిజంగా లచ్చిందే వని రూఢి చెయ్యాలని చెప్పింది. లేకుంటే తాననుకున్న పూలరయికా గా జులూ కొనుక్కున్నాకనే చెప్పేది.

"ఒసోస్, అయితే నిజవేనే నీవన్నమాట. ఏదొక్కై దిటొడెయ్" అనేశాడు గంగులు.

"అబ్బా! నేను పూలరయికా గాజులు కొనుక్కుందారను కున్నాను" అని బుంగమూతి పెట్టింది మల్లమ్మ.

"తల్లి మాలచ్చివి- లచ్చిందేవే మనింటోకొచ్చాక ఇక నీకు నోటేటే? ఒడెయ్ - ఒడెయ్, అందల సగం నాది సగం నీదన్నా నందుకే" అని నవ్వాడు గంగులు.

కోడిపిల్లని లచ్చిందేవని గంగులు ఒప్పేసుకున్నందుకు మల్లమ్మ కడుపు నిండిపోయింది.

"తీసికెల్లు మావా!" అంటూ సంతోషంగా ఐదు రూపాయ లిచ్చింది.

"తల్లి మాలచ్చివి" అంటూ కోడిపిల్లకేసి చూపి ఒక మాటని "సుక్కేసుకొత్తామరి. అలా బజా రెల్లి తలకాయ మావస వట్టుకొచ్చి పులుసెట్టుమరి" అన్నాడు.

"నువ్వే అట్టుకు రాగూడదేంటి? ఐదూ మింగేత్తావా?" అన్నది మల్లమ్మ.

"అదొొక మాట....లచ్చిందేవి సలవే.మిగిల్నయిదుందిగా అందులో రెండ్రూపాయలెట్టి తే. కక్కుర్తిగా రూపాయిదిగాని తెచ్చేవు - పంటి కిందకే రాదొలేయ్" అన్నాడు.

ఏవిటో, మల్లమ్మ కాదనలేక పోయింది.

హుశారుగా వెళ్ళిపోయాడు గంగులు.

"లచ్చిందేవీ!" అని పిలిచింది మల్లమ్మ. 'కీస్, కీస్' మని పలికింది కోడిపిల్ల. "నా తల్లే, నా తల్లే-బంగారు తల్లి" అని ముద్దాడి మురిసిపోయింది మల్లమ్మ.

అలా తల్లిలా కంటికి రెప్పైవ కాచుకుంటూ లచ్చిందేవిని పెంచి పెద్దజేసింది మల్లమ్మ.

పాపం లచ్చిందేవి కాలు మాత్రం సరిగా అతకలేదు.

"సొట్టనడక అదీ, అదేల్లేమే సూడ్డానికే ఏం బాగోలేదు. నాకూ జలుబు జేసినాది - సేరువెట్టవే" అన్నాడొకరోజు గంగులు లచ్చిందేవి పావుకోడయ్యాక.

"ఎంత మాటన్నావు మావా? నీ వన్నమాట నీకే గేపకంలేదా? లచ్చిందేవని ఒప్పేసుకుని మల్లా అదేంమాట? అయినా అది పుంజో పెట్టో తెలవకుండానే" అన్నది మల్లమ్మ.

"కోపి పులుసెట్టెహే! లచ్చిం దేవట - లచ్చిందేవి! బోడి పది రూపాయ లేనాడో వొచ్చినంత మాత్రానికది లచ్చిందేవే? ఏదీ ఆ యెనక మళ్ళొక బొట్టు మన రెక్కల కట్టం గాక పైనెక్కణ్ణుం చైనా రాలిందా? పెట్టు-పులుసెట్టు" అన్నాడు గంగులు.

ఆ మాట మీద మాట పెరిగి నేను కొయ్యను గాక కొయ్యనని

మొండికెత్తింది మల్లమ్మ.

ఎన్నడూ లేనిది ఆ మొగుడు పెళ్ళాలంతగా దెబ్బలాడుకోవడం చూసి, ఆశ్చర్యపోయి, సంగతి తెలుసుకొని తగవుతీర్చారు ఇరుగు పొరుగు.

"నీదే తప్పులేరా గంగులూ! అదలా బిడ్డలా సాక్కుంటుంటే అదేం మాట?" అని పరిష్కరించారు.

"ఆఁ....బిడ్డ....నాకంటే అదే ఎక్కువగాబోలు దానికి." గొణుక్కున్నాడు గంగులు.

"నోర్మూసుకూరుకో రారేయ్! అదేటది? అది జెప్పిన మాట పెకారం అది పుంజవ్వద్దో పెట్టవ్వద్దో సూడాలన్నది సబబుగాదా?" అన్నారు.

నోరుమూసుకున్నాడు గంగులు.

'కొక్కొరోకో' అనకుండా నెత్తి మీద జుట్టు పెంచకుండా 'నేను పెట్టనే సుమా' అంటూ అర కోడయ్యింది లచ్చిందేవి.

ఆ సంగతి ఖాయమని మల్లమ్మ చెప్పిన రోజు-"దీనమ్మ పిగదరగ, నీ మాటే కాయంజేసిందే నంజ" అని తిట్టాడు గంగులు.

"కళ్ళు పేలిపోగలవు - అంత మాటనకు. అది లచ్చిందేవి" అని నవ్వింది మల్లమ్మ.

ఉడుక్కున్నాడు గంగులు.

'లచ్చిందేవీ' అని పిలిస్తే పరిగెత్తుకొచ్చేది కోడి. అది దాని పేరని దానికి తెలిసిపోయింది.

"చూశావా మావా! ఎంత మాలిమయ్యిందో" అనేది మల్లమ్మ.

"ఏట్టహె, ఏనాటికైనా కోసుకు తినే కోడి మీదంత షోకు" అనేవాడు గంగులు.

"అబ్బా!" అనేది మల్లమ్మ.

ఒకరోజు గంగులు బొమ్మర్దొచ్చాడు.

"తెగెయ్యెహె - ఇంకాలీసవెందుకు?" అన్నాడు గంగులు.

"ఏటది?" అన్నది మల్లమ్మ.

"ఏటనడుగుతావేటే? సుట్టపోడొత్తే కోణ్ణిగొయ్యాలని తెల్దేఆపాటి? అందునా సొయాన నీ తమ్ముడు!" అన్నాడు గంగులు.

"నీ కళ్ళెప్పుడూ దానిమీదే మావా! ఎప్పుడూ దానిమీదే బడే

ద త్తవ్. అయినా సొయాన నా తమ్ముడేగా-నేనాడికి జెప్పుకుంటాలే నువ్వు పల్లకూరుకో" అని మల్లమ్మ గసురుతుంటే ఆమె తమ్ముడు కలగజేసుకుని సంగ తంతా తెలుసుకుని, "పోనీలే బావా, అప్పంత ముద్దుగా పెంచుకుం టుంటే దాన్నె కొయ్యాలేంటి? పోన్లెద్దూ" అని అక్క పక్షం పలి కాడు. ఎంతైనా తమ్ముడు మరి! దాంతో ఆ తగువు ఆనాటికి సమసి పోయింది. మరో చుట్టమైతే తెగ్గో యించిపారేసేవాడే గంగులు. 'ఎదవ కోడి - ఎదవ కోడి. నా కన్నా అదే దాని కెక్కువై పోయింది' అన్న కసి పెరిగింది గంగులు మనసులో.

అదెక్కడన్నా ఇంట్లో రెట్ట వేస్తే "సీసీసీసీ-తూ- ఎదవ కోడి. ఇల్లంతా కరాబే. జానడు సుబ్బ మైన జాగాలేకుండా చేసి పారేత్తంది నంజ. దీని రెండో కాలిరగ్గొడితే గాని దీని తిక్క గుదర్దు" అనే వాడు గంగులు.

"అంత పన్జెయ్యకు మావో, నేనూరుకోను" అనేది ఖండితంగా మల్లమ్మ.

"గుడ్డుకొచ్చింది లచ్చిందేవి" అని సంబరపడుతూ చెప్పింది మల్లమ్మ.

"పోనీ గుడ్డన్నా అట్టేసి పెడ తావా?" అన్నాడు గంగులు.

తోకదొక్కిన తాచులా లేచింది మల్లమ్మ - "సీ, ఎప్పుడూ తిండి మీద యావే. నే పిల్లల్ని జేయించు కుంటానని జెప్పలే" అంటే-

"సేయించుకోవే నంజా, సేయిం చుకో. పదిమంది మనవల్నీ పది మంది మనవరాళ్ళ్నీ ఎట్టేత్తది నీ లచ్చిందేవి. మల్లాటన్నిట్నీ గంప కిందెట్టు - గంపెడు ముదిమనవ లొత్తారే - ముదిమనవలు. కడుపు కొక్క కాయ కాయించుకోనేక పోనావుగాని, నంజ కోడిపెట్ట దీని ముద్దుల కూతురంట!" దెప్పిపొడి చాడు గొడ్డుముండా అని గంగులు.

కంటతడిబెట్టింది మల్లమ్మ.

గంపెడాశతో మల్లమ్మంటే తొలిసారిగా తోలుగుడ్డు పెట్టింది లచ్చిందేవి.

ఉసూరుమన్నది మల్లమ్మ.

చేసేదిలేక ఇలాటి సంగతని చెప్పకుండా ఆ గుడ్డు అట్టేసి పెట్టింది మొగుడికి.

అతగాడి దిష్టి దగలబట్టే ఇలా గైందని మల్లమ్మ నమ్మకం.

"ఇదేంటే! నాయాల్ది కోడిగుడ్డే! సెబాసో - ఇన్నాల్టికి తెలిసొచ్చిం దన్నమాట! అయితే రేపట్నుంచి పూట కొక గుడ్డన్న మాట" అంటూ హుశారుగా కంచం ముందు కూర్చున్నాడు గంగులు.

అసలే కసిగా వుందేమో, "ఆఁ... నీ దిష్టి దగలమట్టే అది తోలు గుడ్డెట్టింది" అనేసింది మల్లమ్మ.

సమయం, సందర్భం కలిసొచ్చాయి గంగులికి.

సర్రున లేచాడు.

"ఏటే నీ వాగుడు? అదేమో తోలుగుడ్డెట్టిందా? అదీ నా తప్పే నని నా దిష్టి దగిలిందంటావా? అసల్సంగతెరుగుదువా? ఎవుడి దిష్టి దగిల్నా, ఏదేవైనా, ఎలాగున్నా, అసలు కోడంటూ తోలుగుడ్డెట్ట గూడదే నంజా- శని, దయిద్రం! గాబట్టి ఎంటనే కోసిపారెయ్. ఇక నీ పప్పులుడకవ్. మాపిటి కింటి కొచ్చేసరికి కూర్నేదో బొయిక లిరగ్గొట్టేత్తాను, తోలొలిసేత్తాను. ఇన్నాళ్ళూ ఊరుకున్నానంటే ఊరుకున్నాను గానీ, ఇయాలిక దేముడొచ్చి జెప్పినా ఇనుకొనేది నేదు. జాగర్త! అడి మాటకేస్తే అని కాతరుజెయ్య కూరుకున్నావా- నీ రగతం కళ్ళజూత్తానే - రగతం" అంటూ లచ్చిందేవి మీదున్న కసంతా మల్లమ్మ మీద కక్కాడు గంగులు.

"మావా - మావా" అంటూ బ్రతిమాలబోయింది మల్లమ్మ.

"నోరెత్తావంటే ఇప్పుడికిప్పుడే ఒల్లు సీరేత్తాను. నోర్మూసుకుని సెప్పినట్టు సెయ్" అంటూ విదలించుకొని పోయాడు గంగులు.

మార్గాంతరం లేదనుకుంది మల్లమ్మ.

ఆ రాత్రి కోడికూర లొట్టలేసుకు తింటుంటే ఉసూరుమని కూర్చుంది మల్లమ్మ ఎదురుగా.

అంత బాధ పడుతుందనుకో లేదు గంగులు.

"పోన్లేయే, ఎదవ కోడికోసం అదేటలాగ? లే - లేసి నువ్వు కూడా ఎట్టుకు తిను. గొప్ప మజా గుంది కూర" అన్నాడు.

"నేను తినసుగాక తినను. ఉండిపోతే అట్టే బెడతాను, రేప్పొద్దున సద్దణంలో నువ్వే నంజుకో" అనేసింది.

"అదేంటే అది!" అంటూ ఆశ్చర్యపోయిన గంగులు పరిపరి

విధాల నచ్చచెప్పాడు, ప్రతి మాలాడు. మల్లమ్మ ససేమిరా తిన నంది. చారుతోటే చేయి గడుక్కు లేచిందా పూట - అదిన్నూ రెండు మెతుకులు కతికి లెగిసింది.

'చ చ, ఎంతపని జేశా'నని గంగులు నొచ్చుకున్నాడు.

వారం రోజులు తిరిగేసరికి ఏక్సిడెంటయ్యి కాలు విరిగి మంచాన్న బడ్డాడు గంగులు.

"ఎంతపనై పోనాది మావో! ఏటిలాగయ్యింది?" అని మల్లమ్మ ఏడుస్తుంటే-

"లచ్చిందేవి ఉసురుదగిలిందే" అని బాధపడ్డాడు గంగులు.

"అదేం మాటలే మావా? ఎదవది ఎంతైనా అది కోడి. అలాటి దిగులు మనసులో ఎట్టుకోవాకు" అని వోదార్చింది.

"రెండు రోజులు పోయాకగాని ఏ సంగతీ చెప్పలేము. తప్పని సరైతే కాలు తీసేయాల్సొస్తుంది" అన్నారు హాస్పిటల్‌లో.

"అసిరమ్మ తల్లి!" అని మనసులో మొక్కుకుంది మల్లమ్మ.

అసిరమ్మ మల్లమ్మ మొర విన్నది గాబోలు కాలు నయమై ఇంటికొచ్చాడు గంగులు.

కుంటుతూ, కాలు గెంతుతూ నడుస్తున్న లచ్చిందేవిని చూపి ఇట్టే పోల్చుకుని - "మల్లీ! ఇదేటే ఇది? ఇది మన లచ్చిందేవేగదూ?" అంటూ ఆశ్చర్యపోయాడు.

"ఔను మావా! ఆ రోజున నువ్వూరుకోవని జానికిదేవమ్మగారింటికెళ్ళి సంగతంతా జెప్పి, 'తల్లీ - తల్లీ, దీని పేణం కాపాడు తల్లీ. అందాక నా జీతంలోనుంచి ఒక పది రూపాయలు ఎడ్మాన్సిప్పించు తల్లీ! ఈ పూట ఏదో ఒక కోడిని కోసి అదే లచ్చిందేవని నమ్మించేత్తాను. నీకు రుణమున్నానమకో తల్లీ! నాలో౯జులపాటు లచ్చిందేవిని మీ యింట్లోనే పెంచాలమ్మా మరి' అని బతిమాత్తే పాప మాయమ్మ అందుకొప్పుకుని పది రూపాయలిచ్చింది - అదీ సంగతి" అన్నది మల్లమ్మ.

"మంచిపనిజేశావే" అన్నాడు గంగులు.

"మంచి పనే మరి. ఈనాడది మిగిలుండబట్టే - నా లచ్చిందేవిని నీకిచ్చుకుంటాన్తల్లోయ్ అని అసిరమ్మ తల్లికి మొక్కుకున్నాను" అన్నది మల్లమ్మ.

"ఏటి?" అన్నాడు గంగులు.

"ఏటేటి? దీన్నట్టికెళ్ళి అసిరమ్మ గుడకాడ బలిచ్చి మొక్కు దీర్చుకురా" అన్నది మల్లమ్మ.

"ఒద్దులేయే" అన్నాడుగంగులు.

"ఏటీ?" అన్నది మల్లమ్మ.

"అసిరమ్మ తల్లి నాలాటి కటికి ముండగాదు లేయే" అని నిర్భయంగా నవ్వాడు గంగులు. *